# అర్థంలేని జీవితం

హార్థిక



జీవితానికి అర్థం పర్థం లేదు.
శూన్యంలో పరుగు తీస్తున్న ఒక నక్షత్రం చుట్టూ తిరిగే ఈ భూగోళం మీద కొన్ని పరిస్థితుల ప్రాబల్యం వల్ల జీవం ఉద్భవించింది. అలా పుట్టిన జీవం మరికొన్ని పరిస్థితుల్లో గిట్టక మానదు. ఆ జీవుల్లో మానవుడూ ఒకడు. అంతకన్నా అతడికి ఏ ప్రత్యేకతా లేదు. సృష్టిక్రమానికి పరాకాష్ఠగా అతడు అవతరించలేదు. పర్యావరణానికి జీవస్పందనే మానవుడి రూపు ధరించింది.

జీవితానికి అర్థం లేదు. మనిషి జీవితం వల్ల ఈ సృష్టికి ఒరిగేదేమీ లేదు. అతడు పుడితేనేమి? పుట్టక పోతేనేమి? అతడు జీవించినా, మరణించినా ఎవరికేం లెక్క! అసలు ఈ జీవితమే అప్రధానం, మరణమూ నిష్ఫలం.

– ఆఫ్ హ్యూమన్ బాండేజ్‌లో సోమర్‌సెట్ మామ్ పలుకులు

***

అవి కటువైన మాటలుగా, బొత్తిగా భౌతికవాదం ఒలికించే పలుకులుగా ధ్వనించవచ్చు. తన జీవితానికి అర్థం లేదనీ, విలువ లేదనీ అనుకోవడానికి ఏ మనిషీ ఇష్టపడడు. అయితే, 20 ఏళ్ళ క్రితం నా జీవితంలో సంభవించిన కొన్ని ఘటనలు నా జీవితాన్ని నిజంగానే నిరర్థకంగా మార్చేసి ఉండేవి.

తనకు కానీ, తన కుటుంబానికి కానీ, సమాజానికి కానీ ఉపయోగపడని జీవితం గడిపేవాడిని చూస్తే మామ్ పలుకులు నిజమేనని పిస్తాయి. తన చుట్టూ ఉన్నవారిని నానారకాల బాధలకు గురిచేసే వ్యక్తి, చివరకు ఏదో ఒకరోజు నూరు గొడ్లను తిన్న రాబందు ఒక్క వడగళ్ళ వానకు చచ్చినట్లు కడతేరక మానడు.

చూడటానికి అతడు చాలా మామూలు మనిషిలా, మెత్తగా కనిపిస్తాడు. అతణ్ణి చూసినవారెవరూ అతడు చులాగ్గా గొంతులు కోయగలడని అనుకోరు. చేసిన నేరాలకు శిక్ష పడవచ్చుననే భయం ఏ కోశానా లేని మనిషి అతను. బహుశా అతని పెంపకమే అలాంటిదేమో!

నాగయ్య తన పేరుకు తగినట్లే నాగు పాములాంటివాడు. అయితే, పైచూపులకు అతనలా కనిపించడు. ఎప్పుడూ జోకులు విసురుతూ ఒక హీరోలా మసలుతాడు తప్ప విలన్‌లా అగుపించడు. ఎన్ని చెడ్డ పనులు చేసినా వాటి గురించిన చింతే ఉండదు అతడికి. ఆ చెడ్డ పనులకు తనవరకు సరైన కారణాలే వల్లిస్తాడు. తన దురుసుతనాన్ని సమర్థించుకునే తత్వాన్ని ఒంటబట్టించుకున్నాడు, దాన్నే వల్లెవేస్తాడు. చూడటానికి అతడు చాలా మామూలు మనిషిలా, మెత్తగా కనిపిస్తాడు. అతణ్ణి చూసినవారెవరూ అతడు చులాగ్గా గొంతులు కోయగలడని అనుకోరు. చేసిన నేరాలకు శిక్ష పడవచ్చుననే భయం ఏ కోశానా లేని మనిషి అతను. బహుశా అతని పెంపకమే అలాంటిదేమో! నాగయ్యని చూసి ఊరంతా భయపడుతుంటే, అదేదో గొప్ప హీరోయిజమని మురుసుకొంటాడతడు.

నాగయ్య పొడగరేమీ కాదు. 5 అడుగుల 3 అంగుళాల ఎత్తు ఉంటాడు. కానీ, అతడు మహా చురుకైన మనిషి. తన స్వార్థం కోసం పులిలా పోట్లాడగలడు. పోలీసులు కమ్ముకొచ్చినపుడు ఒలింపిక్ ఆటగాడిలా ఎవరికీ చిక్కకుండా పరుగు తీయగలడు. తెలివంటే అతడిదే– గుంటనక్క తెలివి. అతడు ఎవరినైనా చంపినపుడు, గబ్బర్ సింగ్‌లా తన అఘాయిత్యం ఏళ్ల తరబడి ఊరంతటికీ గుర్తుండేటట్లు, తన పేరు వింటే పిల్లలు నిద్రలో కూడా ఉలిక్కిపడేట్లు జాగ్రత్త తీసుకుంటాడు. ''తలకాయలు లేచిపోతాయ్'' ఇదీ అతడి ఊత పదం. ఏదో హిట్ సినిమా పాటలా ఆ పదాన్ని వల్లిస్తాడు. క్షుద్రమంత్రంలా జపిస్తాడు. ఓ తాంత్రికుడిలా తన ఈ మాటలు లోకాన్ని వణికిస్తాయని తలపోస్తాడు.

నాగయ్యకు ఇద్దరు తమ్ముళ్ళు ఉన్నారు. ఒకడి పేరు రాజయ్య. రెండోవాడి పేరు వెంకయ్య. ఈ రెండో తమ్ముడు 25 ఏళ్ళ వయసులోనే ఏదో అంతు చిక్కని వ్యాధితో మరణించాడు. ఆ వ్యాధి ఎయిడ్స్ అని ఊరంతా గుసగుసలు. వెంకయ్య 16వ ఏట నుంచే తాగి తందనాలాడటం, వ్యభిచరించడం అతడికి చావును కొనితెచ్చాయి. నాగయ్య కుటుంబం చేసిన పాపాలే, అతని రెండో తమ్ముడి చావుకు కారణమని అందరూ అనుకున్నారు.

మొదటి తమ్ముడు రాజయ్య తీరే వేరు. ఏ పని చేసినా చిక్కడు దొరకడులా చేస్తాడు. ఒక మధ్యాహ్నం రాజయ్య గుంట నక్కలా ఓ ఇంట్లో చొరబడ్డాడు. ఆ ఇంట్లో ఓ పూజారి కుటుంబం కాపురం ఉంటోంది. పూజారి బాగా వృద్ధుడైపోయాడు. అందువల్ల అర్చకత్వానికి తిలోదకాలు ఇవ్వవలసివచ్చింది. గుడి ఉద్యోగంలో అతడు సంపాదించుకున్నది ఏమీ లేదు. భార్య కూడా ముసలితనం తెచ్చే రోగాలతో అవస్థలు పడుతోంది. ఆ వృద్ధులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొడుకు దగ్గర్లోని పట్నంలో ఏదో దుకాణంలో గుమాస్తాగిరీ చేస్తున్నాడు. అతడికి పెళ్ళై, పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులనూ, ఈడు వచ్చిన చెల్లెల్నీ పోషించే భారం కూడా అతడిదే. గుమాస్తా పనితో పాటు ట్యూషన్లు చెప్పుకుంటూ ఎలాగోలా బండి లాగిస్తున్నాడు. అతడి చెల్లెలు అందమైంది. రాజయ్య ఆమెపై కన్నేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి లోపల చొరబడి ఆమెను బలాత్కరించాడు. విషయం ఊరంతా పొక్కి ఆమె కుటుంబం కుమిలిపోయింది. అయితే, చాలా మంది అభాగినుల్లా ఆమె ఆత్మహత్య చేసుకోలేదు. తక్కువ కులంవాడైనా రాజయ్యనే పెళ్లి చేసుకుంది. తల్లిదండ్రులు, అన్న దీన్ని భరించలేక ఊరు విడిచి వెళ్ళిపోయారు. అయినా, సడలని ధైర్యంతో ఆమె జీవన పోరాటం చేపట్టింది. విధిరాతపై, తన అందంపై, తన జీవితాన్ని నాశనం చేసిన దుర్మార్గుడి పనిపట్ట లేని అన్నగారి అశక్తతపై రగిలే ఆగ్రహమే ఆమెను ముందుకు నడిపించింది. తన దురదృష్టంపై మొదట్లో పనికిమాలిన సానుభూతి చూపి, తర్వాత అంటరానిదానిగా వెలివేయడం తప్ప న్యాయం చేయలేని సమాజంపై ఆగ్రహం ఆమెను అసలైన మగాడిలా నిలబెట్టింది. నాగయ్య అంటే భయమే ఊరివారిని చేతగానివాళ్ళుగా మిగిల్చింది. అందుకే, అతడి సోదరుడు రాజయ్యను శిక్షించడానికి కానీ, అతడి కామానికి బలైన అభాగినిని ఆదుకోవడానికి కానీ ఎవరూ ముందుకు రాలేదు. చదువూ సంస్కారం ఉన్నాయనుకున్నవారు సైతం మన కెందుకులే అనుకుని రోజువారీ జీవితాల్లో నిమగ్నమపోయారు. అంతకుముందు ఆమెకు ప్రేమలేఖలు రాసిన యువకులు కూడా మానభంగం తర్వాత ఆమెను చూస్తేనే ఎయిడ్స్ రోగిని చూసినట్లు పారిపోసాగారు. ఇదంతా చూసి జీవితానికి అర్థం లేదని ఆమె తలపోసి ఉండవచ్చు. అయినా మనసును రాయి చేసుకుని, తనను బలాత్కరించిన రాజయ్య తక్కువ కులంవాడైనా అతణ్ణే పెళ్ళి చేసుకుని పిల్లలను కన్నది. కాలక్రమంలో ఆ అభాగిని రాజయ్య బిడ్డలకు జన్య ఇచ్చింది. రోపిడీలు, దౌర్జన్యాలే వృత్తిగా పెట్టుకున్న రాజయ్యతో కాపురం ఆమె అందచందాలను హరించవేసింది.

చదువూ సంస్కారం ఉన్న యువతిని పెళ్ళాడినా రాజయ్య తన పద్ధతులు మార్చుకోలేదు. దొంగతనాలు, ఊళ్ళోని వాళ్లను ఊరకే కొట్టడం, హత్యలు షరామామూలుగా కొనసాగించాడు. కొన్నేళ్ళ తర్వాత పోలీసులకు చిక్కి జైలుపాలయ్యాడు. ఏడేళ్ళు జైల్లో ఉన్న తర్వాత ఓ స్వాతంత్ర్య దినంనాడు రాష్ట్రపతి క్షమాభిక్ష వల్ల విడుదలయ్యాడా. అతడితోపాటు విడుదలైన కొందరు మారిన మనుషులయ్యారు. రాజయ్య మాత్రం ఊహ తాను పుట్టిందే నేరాలు ఘోరాలు చేయడానికన్నట్లు పాత జీవితాన్నే కొనసాగించాడు.

తర్వాత ఒక రోజు ఏదో చిన్న తగాదాలో తనను పట్టుకోవడానికి వచ్చిన ఓ పోలీసు కానిస్టేబుల్‌ను కత్తితో పొడిచాడు. ఇక దీన్ని పోలీసులు సహించలేకపోయారు. ఓ శుభముహూర్తంలో అతడిని పట్టుకుని చితకబాది, ఎందుకూ పనికిరాకుండా చేసేశాడు. చావుతప్పి కన్నులొట్టపోయి బయటపడిన రాజయ్య పక్షవాతంతో మూడేళ్ళు తీసుకుని కన్నుమూశాడు.

అతడి అభాగ్య భార్య చివరివరకూ అతడి వెంటే ఉంది. అతడికి పుట్టిన పిల్లలకు చదువుసంధ్యలు నేర్పింది. పిల్లలు తండ్రి బాటను అనుసరించే ప్రయత్నం చేసిన ప్రతిసారీ గట్టిగా దండించి దారిలో పెట్టుకుంటూ వచ్చింది. రాజయ్య మరణంతో ఆమెకు పట్టిన జీవితకాల శని వదిలిపోయింది. ఈలోగా పిల్లలు చేతికివచ్చి ఆమె బతుకు ఒక గాడిలో పడింది. రాజయ్య జీవితం నిజంగా అర్థం లేనిదే. తన జీవితంతోపాటు అభాగిని జీవితాన్ని కూడా అర్థం లేనిదిగా మార్చినా, ఆమె పట్టుదలతో చివరకు ఓ అర్థం కనుగొన్నది.

***

ఆ ఊరు పట్నానికి కొంత దూరంలో కొండల మధ్య విసిరేసినట్లు ఉంటుంది. అక్కడి వారంతా వృత్తిద్యోగవ్యాపారాల కోసం పట్నానికే వెళతారు. రెండు జిల్లాల సరిహద్దుపై ఉన్న ఆ ఊరు చివరకు ఎవరికీ చెందని బిడ్డలా మిగిలింది. దొంగతనాలే సంప్రదాయ వృత్తిగా ఉన్నవారు ఆ ఊర్లో చాలా మంది ఉన్నారు. అయితే, ప్రభుత్వం భూములు కేటాయించి, విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించడంతో దాదాపుగా వారంతా ప్రధాన జీవన స్రవంతిలో మమేకమయ్యారు. ఒక్క నాగయ్య, అతడి సోదరులు తప్ప. సారా అమ్మడం, ఇరుగుపొరుగుల ఇళ్ళలో, గుడిలో, రహదారిలో దోపిడీలు చేయడం వారికి ప్రధాన వృత్తి. ఒక నేరంలో పట్టుపడిన నాగయ్య జైలుకు వెళ్ళవలసి వచ్చింది. కాలక్రమంలో నాగయ్య కుటుంబాన్ని ఎదిరించకతప్పని పరిస్థితి, ఊరివారికి ఒక రోజు ఎదురైంది. అప్పుడు నేను 20 ఏళ్ళవాడిని.

***

ఆ రోజుల్లో రిచర్డ్ అటెన్‌బరో తీసిన గాంధీ చిత్రం విడుదలైంది. దాన్ని చూసి ప్రేరణపొందిన

యువకులం పదిహేనుమందిమి ఒక గ్రామసేవా సంస్థను ప్రారంభించాం. తీరిక సమయాల్లో ఊరికి నిజంగా ఉపకారం చేయడం మా లక్ష్యం. స్కూలులో, రోడ్డు పక్కల మొక్కలు నాటడం, రోడ్లపై గుంటలు పూడ్చటం, గ్రామసమస్యలపై అధికారులకు అర్జీలు పంపడం, ఇంకా ఇతరత్రా ఊరికి చేతనైనంత సేవ చేయడం మా సంఘం లక్ష్యం. మా ప్రయత్నాల ఫలితంగా ఊరికి ఓ రేషన్ దుకాణం, గ్రంథాలయం లభించాయి. సమైక్యంగా మేము సాధించిన ఈ విజయాలు ఎంతో ఆనందం కలిగించాయి.

రాజకీయపార్టీలకు మేము ఉద్దేశపూర్వకంగానే దూరంగా ఉన్నాం. మా సంఘంలోని 15 మందిమీ వ్యక్తిగతంగా వేర్వేరు పార్టీలకు, సిద్ధాంతాలకు చెందిన వారమే. కానీ, మా సంఘాన్ని ఏదో ఒక పార్టీ ఛత్రం కిందకు తీసుకొస్తే, మేమంతా భిన్నవర్గాలుగా చీలిపోవడం, ఘర్షణలు పెరగడం జరుగుతుందని మా భయం. అందువల్ల, మేము పార్టీలకు అతీతంగా పనిచేసి, ఊరికి చేతనైనంత సాయం చేసే వాళ్ళం. ఊళ్ళోనూ, పక్క ఊళ్ళలోనూ ఉండే పార్టీ నాయకులు మమ్మల్ని తమతమ పార్టీలో చేరమని ప్రోత్సహించినా, ఒకటీ అరా సందర్భాల్లో బెదిరించినా మేము మాత్రం అవేవీ లెక్కచేయకుండా మా దారిలోనే ముందుకు వెళ్ళాం.

ఉన్నట్టుండి ఒక రోజు నాగయ్య జైలు నుంచి విడుదలై ఊరికి తిరిగి వచ్చాడు. మా సంఘంలోనూ, ఊరిలోనూ యువకులలో పొంగిపొర్లుతున్న ఉత్సాహాన్ని గమనించాడు. అతడు గనుక మామూలు మనిషైతే కదా! గ్రామ సేవ కోసం అంకితమైన యువకులను చూసి అతడికి కన్నుకుట్టింది. తనంటే అందరూ హడలుకోవాలని నాగయ్య ఉద్దేశం. ఊళ్ళో కొంతమంది యువకులు ఐక్యంగా పనిచేయడం చూసి, వారు తనను ఎదిరించే సాహసం చేయవచ్చేనని అతడికి అనుమానం పట్టుకొంది.

నాగయ్య తిరిగివచ్చిన కొద్ది రోజులకు ఒక ఇంట్లో దొంగతనం జరిగింది. రాజకీయ పార్టీలు రంగప్రవేశం చేసి, బాధితులను పరామర్శించారు. ఊరి పెద్దలు సమావేశమై, దొంగతనాలు జరగకుండా చూడటానికి రాత్రి పూట పహారా తిరిగే బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంతకీ దొంగతనం చేసిందెవరో అందరికీ తెలుసు. అయితే, అతడి పేరు ఉచ్ఛరించే సాహసం ఎవరిలోనూ లేదు. అందుకే అందరూ గ్రామ సంఘం చాటున దాక్కున్నారు. గ్రామ పెద్దలు రాత్రిపూట కర్రలు పట్టుకుని పహారా తిరిగారు. వారం గడిచేసరికి వారిలో ఉత్సాహం సన్నగిల్లి అయోమయంలోకి జారుకుని నీరసపడిపోయారు. ఉదయాన్నే పనులకు వెళ్ళి రాత్రిపూట పహారా తిరిగే ఓపిక ఎవరికి మాత్రం ఉంటుంది కనుక! అందుకే, పహారా బాధ్య



## చంపేస్తా!

*టీవిల్లోనూ, సినిమాల్లోనూ బిజీగా వున్న నటి నేహా. మన తెలుగు సినిమాల్లో కూడా నటించింది. నితిన్ పక్కన దిల్‌లో మెరుపులా మెరిసింది గుర్తుందా? ఇప్పుడు ఇంకో తెలుగు సినిమాలో కూడా నటిస్తోంది.*

*“16 ఏళ్ళ వయసులోనే యాక్టింగ్ ప్రారంభించాను. రెండు మూడు యాడ్స్‌లో యాక్ట్ చేసిన తరువాత సినిమా ఛాన్స్ వచ్చింది. చదువుని వాయిదా వేసి నటించాను. తరువాత వరుసగా టివి సీరియల్స్... అప్పుడప్పుడు సినిమాలు. ఈమధ్య నేనో టివి సీరియల్ షూటింగ్‌లో స్పృహతప్పి పడిపోతే రకరకాలుగా పుకార్లు వ్యాపించాయి. టివి షూటింగ్ అంటే గంటల తరబడి పనిచేయాలి. అలసట లేకుండా వుండటానికి నేనేమైనా దేవతనా?” అంటోంది నేహా. ఈమధ్య ఇక్బాల్ అనే కుర్రాడి ప్రేమలో పడింది ఈ సుందరి. ఇక్బాల్‌వైపు ఏ ఆడపిల్లయినా కన్నెత్తి చూస్తే చంపేస్తానంటోంది.*

తను మా యువజన సంఘానికి అప్పగించారు.

ఈలోపు నాగయ్య విభజించి పాలించు సిద్ధాంతాన్ని ఎంచక్కా అమలులో పెట్టాడు. మొదట అతడు మా సంఘం నుంచి అతడి కులం కుర్రాళ్లను వేరుచేశాడు. తర్వాత తమ కులంవాళ్ళతో పోటీ యువజన సంఘం పెట్టాడు. మేమంతా అగ్రకులంవాళ్ళం కనుక తమపై దొంగతనం ఆరోపణ మోపి అవమానిస్తున్నామని ప్రచారం చేశాడు. ఆ విధంగా తన కులంలోని పిన్నలూ పెద్దల మనసులలో విషబీజాలు నాటాడు. వాళ్ళకు మద్దతుగా ఒక రాజకీయ పార్టీ రంగప్రవేశం చేస్తే, దాని ప్రత్యర్థి పక్షం మా వెనుక నిలచింది. రెండు సంఘాల మధ్య విభేదాలు పెరిగి కొట్లాటల దాకా వచ్చింది. ఎదుటి వాళ్ళ దౌర్జన్యాన్ని ఎదుర్కోవడానికి మేము కలాలూ కాగితాలు వదిలి కత్తులు కటార్లు పట్టవలసివచ్చింది. ఈ గందరగోళంలో గ్రామ సేవ అనే మా సంఘం లక్ష్యం గాలికి ఎగిరిపోయింది. మేమంతా వాళ్ళను హీనంగా చూస్తూ అవమానిస్తున్నామని ఎదుటి పక్షం వాళ్ళు ఆరోపిస్తుంటే, మేము నాగయ్య తమ్ముడు బ్రాహ్మణ యువతిని మానభంగం చేసిన ఘటనతోపాటు, ఇతర అత్యాచారాలను ఏకరవు పెట్టసాగాం. రెండు శిబిరాల మధ్య వాదప్రతివాదాలు, ఆరోపణ ప్రత్యారోపణలు పెరిగిపోయాయి.


చివరకు గ్రామాన్ని రక్షించేదిపోయి మా యువజనులమంతా ఆత్మరక్షణలో దిగబడిపోయాం. ఒక రోజు మేము ఆట మైదానంలో క్రికెట్ ఆడుకుంటున్నాం. చీకటిపడుతుండగా నాగయ్య కొడుకు మా బృందంలో ఒకరిని కత్తితో పొడిచాడు. అతడి మేనల్లుళ్లు మాపై రాళ్ళు రువ్వారు. మరోవైపు నాగయ్య రణరంకెలు పెడుతూ గ్రామంలో భీతావహ వాతావరణం సృష్టించాడు. ఈ ఘటన తర్వాత మా పెద్దలు సమావేశమయ్యారు. అందులో నాగయ్యను హతమార్చాలని ఒక పెద్దాయన సూచించాడు. ఆ పని చేయనిదే గ్రామానికి శాంతి ఉండదన్నాడు. దాని కోసం పెద్దలు ఒక పథకం కూడా రచించారు.

ఇదంతా చూసి మేము నివ్వెరపోయాం. ఈ వ్యవహారాన్నంతటినీ మా అమ్మ నా పెద్దన్నకు తెలియజేసింది. అప్పట్లో సివిల్ సర్వీసు పరీక్షల కోసం పట్నంలో ఉండి చదువుకుంటున్న మా అన్న హడావిడిగా ఊరికి వచ్చాడు. హత్యలూరక్తపాతానికి దూరంగా ఉండాలని మా మిత్రబృందానికీ, గ్రామ పెద్దలకూ హితవు చెప్పాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడం, రాజీ సమావేశం ఏర్పాటు చేయడం, ఎదుటిపక్షంవారికి తోడ్పడిన ఓ సంఘ సేవా సంస్థ ప్రతినిధులతో సంప్రదించడం వంటి ప్రత్యామ్నాయాలు ఆలోచించాలని సూచించాడు. ''పిల్లలను హింసా ఊబిలోకి లాగకండి'' అని పెద్దలతో చెప్పాడు.

ఈ లోగా నాగయ్య ముఠాకు మద్దతు ఇస్తున్న రాజకీయపార్టీలో మా బంధువు ఒకాయన, నాగయ్య మా బృందంపై దాడి చేసి ఒకరిద్దరిని హతమార్చాలని కుట్రపన్నుతున్నాడని హెచ్చరించాడు. అతడు గురిపెట్టినవారిలో నేనూ ఉన్నానని వెల్లడించాడు. ''తమ్ముడిని ఈ తగాదాకు దూరంగా వేరే ఊరికి పంపించెయ్. లేకపోతే వారం తిరక్కుండానే అతడి ప్రాణాలు లేచిపోతాయ్'' అని నా అన్నకు ఉప్పందించాడు.

ఇది విని నా రక్తం ఉడికిపోయింది. ''దెబ్బకు దెబ్బతీయాలి, మనమే నాగయ్యను సఫాచేయాలి'' అని నేనూ, నామిత్రులూ అన్నగారి ముందు వాదించాం. ''భయపడి పారిపోవడం సిగ్గుచేటు. నిలబడి పోరాడదాం. రాకాసి నాగయ్యను ఎవరో ఒకరు ఎదిరించాల్సిందే కదా! విజయమో వీరమరణమో తేల్చుకోవలసిందే'' అని మేము బల్లగుద్ది చెప్పాం.

ఇలాంటి సిద్ధాంతాలూ, ఆదర్శాలను మా అన్న




గుడ్డిగా అనుసరించే మనిషి కాదు. వాస్తవికంగా, ఆచరణాత్మకంగా ఆలోచించే మనిషి అతను. జీవితం గురించి నాకన్నా, నా మిత్రులకన్నా ఆయనకే ఎక్కువ తెలుసు. అమ్మానాన్న కూడా అన్నమాట వినాలని నాకు బోధించారు. ''అన్న చెప్పేది విను అన్ని విషయాలూ లోతుగా ఆలోచించి కానీ ఏ పనీ చేయడు. ఆయన సలహా పాటించు'' అని జ్ఞాన బోధ చేశారు.

దాంతో మా కుటుంబం ఊరి తగాదా నుంచి విరమించుకొంది. హింస వద్దని రెండు పక్షాలకూ నచ్చచెప్పిన నా అన్న, అందరూ మొండికేయడంతో ఇక పోలీసులకూ, కలెక్టర్‌కూ, పత్రికలవారికీ ఈ వ్యవహారం గురించి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించాడు. నాన్న నెలరోజులపాటు నన్ను బంధువుల ఇంటికి పంపేశాడు. ఈలోగా, మా అన్న హితబోధ, హెచ్చరికలు పనిచేసినట్లుంది. రెండు పక్షాలూ పోలీసులను ఆశ్రయించాయి. పోలీసులు గ్రామంలో అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసి, నాగయ్యను, అతని కొడుకు, మేనల్లుళ్ళను ఊరి నుంచి తరిమేశారు. అలా ఊరికి పెద్ద ప్రమాదం తప్పిపోయింది. నెమ్మదిగా సాధారణ పరిస్థితి ఏర్పడింది. నాగయ్య కూడగట్టిన కులం కుర్రాళ్ళు ఎవరి పనుల్లోకి వారు వెళ్లిపోయారు. క్రమంగా వివాద జాడలు అదృశ్యమయ్యాయి.

కొన్నేళ్ళ తర్వాత నాగయ్యను అతడి మేనల్లుళ్లే నరికి చంపేశారు. దోపిడీ సొత్తు పంచుకునే విషయంలో నాగయ్యకూ, అతని మేనల్లుళ్ళకూ ఏర్పడిన తగాదాయే దీనికి మూలమని అంతా అనుకున్నారు. ఈ తగాదాలో నాగయ్య కొడుకు చేయితెగిపోయింది. కత్తితో తిరిగేవారు ఆ కత్తికే బలయ్యారని అంతా చెప్పుకున్నారు. ''తలలు లేచిపోతాయ్'' అన్న నాగయ్య ఊతపదం అతడి విషయంలోనే నిజమైంది. ఆపైన కొన్నేళ్ళకు నాగయ్య మేనల్లుళ్ళు కూడా ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. వారిపై పగ తీర్చుకునే అవకాశం చిక్కలేదని నాగయ్య కొడుకు తెగబాధపడిపోయాడు. అతడేమీ పాఠం నేర్చుకోలేదన్నమాట.

***

ఆనాడు మా అన్న చలవతో మేము హింస ప్రతిహింసల ఊబిలో పడకుండా దూరంగా ఉన్నాం. మరి నాగయ్య! ఆ ఊబిలో కూరుకుపోయి చివరకు హతమారిపోయాడు. సోమర్‌సెట్ మామ్ చెప్పినట్లు అతని జీవితానికి నిజంగానే అర్థం లేకుండా పోయింది. అయితే, మేము మాత్రం మామ్ మాటలే అర్థం లేనివని నిరూపించాం. అన్నయ్య ఐ. ఏ. ఎస్ అధికారి అయ్యాడు. నేను సొంత పరిశ్రమ స్థాపించి 100 మందికి ఉపాధి కల్పించాను. మా యువజన సంఘం సభ్యులు జీవితంలో స్థిరపడ్డారు. ఒకరిద్దరు అమెరికా వెళ్ళారు. మరో మిత్రుడు ఇంగ్లండ్‌లో ఓ బ్యాంకులో పనిచేస్తున్నాడు. మా సొంత డబ్బుతో ఊరిలోని పాఠశాలకు కొత్త భవనం నిర్మించాం. రోడ్లు వేయడానికీ చేతనైన సహాయం చేశాం. మంచినీటి సరఫరా పథకానికి తోడ్పడ్డాం. మేము చిన్నప్పుడు చదువుకున్న హైస్కూల్ ఇప్పుడు జూనియర్ కాలేజ్ అయింది. గ్రామంలో అన్ని వసతులూ సమకూరి అందమైన ఆదర్శ గ్రామంగా నిలచింది. ఆ కులం ఈ కులం అని లేకుండా ఊరివారందరూ తమ జీవితాలను మెరుగుపరచుకున్నారు. నాగయ్య కులంలో కొందరు ఉన్నత ప్రభుత్వాధికారులు అయ్యారు కూడా.

నాగయ్య జీవితానికి అర్థం లేకపోవచ్చు. అతడు మా జీవితాలనూ నిరర్థకంగా మార్చగలిగేవాడే. అన్నయ్య నాలో, మా గ్రామంలో వివేకం రగిలించబట్టి, అందరం హింసోన్మాదం నుంచి బయటపడి, జీవితాలను అర్థవంతం చేసుకోగలిగాం. దానాదీనా, జీవితానికి అర్థం కనుకొనడమనేది మన చేతుల్లోనే ఉందని తేలిపోయింది కదా!

★